# త్యాగాలకు ప్రతీక బ్రక్రీద్ : ఐటీడీఏ పీవో



**భద్రాచలం, జూన్ 6 (ప్రజాజ్యోతి ):** త్యాగాలకు ప్రతీక బ్రక్రీద్ పండుగ అని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శుక్రవారం బక్రీద్ పండుగ సందర్భంగా ఏజెన్సీ ఏరియాలో మారుమూల ఆదివాసీ గ్రామాల్లోని ఆదివాసీ గిరిజనులు, ముస్లీం ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులకు సేవలందిస్తున్న ముస్లీం ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పీవో మాట్లాడుతూ ముస్లీంలు బక్రీద్ పండుగ జరుపుకుంటారని, రంజాన్ తర్వాత వచ్చే రెండో అతిపెద్ద పండుగ బక్రీద్ పండుగ అని ఆయన తెలిపారు. త్యాగాలకు ప్రతీకగా చెప్పే బక్రీద్ పండుగను ముస్లీంలు కుటుంబాలు భక్తిశ్రద్ధలతో ఉత్సాహంగా జరుపుకోవాలని కోరారు.


జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

శనివారం | 7 | జూన్ | 2025 ◆ పేజీలు : 4





## ప్రమాద భీమా పథకం అమలులో...

# దేశానికే ఆదర్శం సింగరేణి

- సింగరేణి బాటలో పలు రాష్ట్రాల్లో ప్రమాద భీమా పథకం అమలు
- కోటి రూపాయల ప్రమాద భీమా చెక్కు పంపిణీ కార్యక్రమంలో సీఎండీ ఎన్.బలరామ్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 6, ప్రజాజ్యోతి :** రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా అమలు జరుపుతున్న కోటి రూపాయల ప్రమాద భీమా పథకం ఈ రోజు దేశానికే ఆదర్శప్రాయం అయిందని సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ .బలరామ్ పేర్కొన్నారు. ఇటీవల ప్రమాదంలో మృతిచెందిన మణుగూరుకు చెందిన ఈపీ ఆపరేటర్ మూల్ చంద్ విశ్వకర్మ సతీమణి హరిదేవి విశ్వకర్మకి శుక్రవారం కొత్తగూడెం హెడ్డాఫీసులో కోటి రూపాయల ప్రమాద భీమా చెక్కును అందజేస్తున్న సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎండీ తన సందేశం ఇచ్చారు. మణుగూరులో ప్రమాదంలో మృతి చెందిన మూల్ చంద్ విశ్వకర్మకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో కార్పోరేట్ శాలరీ అకౌంట్ ఉందని, ఈ నేపథ్యంలో ఆయన కుటుంబానికి కోటి రూపాయల భీమా వర్తిం చిందన్నారు. దేశంలో ఏ ఇతర రాష్ట్రాలు, ప్రభుత్వ సంస్థల్లో లేని విధంగా సింగరేణి సంస్థ తొలిసారిగా బ్యాంకుల వారితో మాట్లాడి గరిష్టంగా

మిగతా 2 లో...



# భూ సమస్యల పరిష్కారానికి వేదికలుగా రెవెన్యూ సదస్సులు

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 6, ప్రజా జ్యోతి :** రెవెన్యూ, భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి భూభారతి రెవెన్యూ సదస్సులు వేదికలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండలం మిట్టగూడెం గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సదస్సు కు వచ్చిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిని ఆన్లైన్ లో నమోదు చేస్తున్నారా? లేదా అని అధికారులను ఆరా తీశారు. వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.స్వీకరించిన దర ఖాస్తులకు రసీదులు అందించాలని,సంబంధిత రిజిస్టర్లలో వివరాలు రాయాలని ఆదేశించారు. దరఖాస్తుల స్వీకరణ,

మిగతా 2 లో...

# "వకీల్ "గా న్యాయ సలహాలు అందిస్తా

- న్యాయ రంగంలో ప్రజలకు మరింత సేవలందిస్తా .. ఏమ్ఎల్ఏ జారే
- న్యాయవిద్య ప్రవేశ పరీక్షల రాసిన ఎమ్మెల్యే జారే



**అశ్వారావుపేట, జూన్ 06, ప్రజాజ్యోతి:** ప్రజలకు న్యాయం అందించేందుకు, వకీల్ గా వారికి సేవ చేయాలని తొలి నుంచి ఆసక్తి కలిగి ఉండేవాడినని అశ్వారావుపేట శాస నసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. న్యాయ విద్యపై ఉన్న ఇష్టంతో శుక్రవారం ఎమ్మెల్యే జారే హైదరాబాదులో నిర్వహించిన లాయర్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుండి ప్రజలు ఎదుర్కొంటున్న న్యాయ సమస్యలను చూసి న్యాయవిద్యపై ఆసక్తిని పెంచుకున్నానని వారి సమస్యలకు న్యాయపరంగా పరిష్కారం అందించేందుకు న్యాయవిద్యను

మిగతా 2 లో...

# సబ్ జైల్ ను సందర్శించిన జిల్లా లీగల్ న్యాయ సేవా సంస్థ కార్యదర్శి



**ఇల్లందు, జూన్ 6, ప్రజాజ్యోతి :** ఇల్లందు సబ్ జైల్ ను శుక్రవారం జిల్లా లీగల్ న్యాయ సేవా సంస్థ కార్యదర్శి రాజేందర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైలు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. జైలులో ఉండే ఖైదీలకు ఆర్థిక స్తోమత లేని వారికి న్యాయ సంస్థ తరపున న్యాయవాదిని నియమించడం జరుగుతుందని పేర్కొన్నారు. తరచూ నేరాలకు పాల్పడే వారి ప్రవర్తన మారితే ప్రభుత్వం ద్వారా వచ్చే లబ్ధి అందేలా చూస్తామన్నారు. అదేవిధంగా ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. ఉమామహేశ్వరరావు, జైలు సూపరిండెంట్ ఎన్. చంద్రశేఖర్ రావు, భుజంగరావు, శ్రీనివాస్, దులియా తదితరులు పాల్గొన్నారు.

## "వకీల్ "గా న్యాయ సలహాలు అందిస్తా

(మొదటి పేజీ తరువాయి...)

అభ్యసించాలన్నకోరిక కలిగిందన్నారు. శాసనసభ్యునిగా నియోజకవర్గంలో ఉన్న ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని, అంతేకాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న న్యాయ సమస్యలను పరిష్కరించే దిశగా వారికి అండగా ఉండేందుకు న్యాయవిద్యను అభ్యసించేందుకు పరీక్ష రాశానన్నారు. ఎమ్మెల్యే జారే తీసుకున్న ఈ నిర్ణయం యువతకు ప్రేరణగా నిలుస్తుందని బాధ్యత గల ప్రజా ప్రతినిధిగా ఉంటూ ఉన్నత విలువలతో మార్గదర్శకుడుగా నిలుస్తున్న జారే తీరుపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ప్రమాద భీమా పథకం అమలులో దేశానికే ఆదర్శం సింగరేణి

(మొదటి పేజీ తరువాయి...)

కోటి 25 లక్షల రూపాయల ప్రమాద భీమా పథకాన్ని అమలు జరపడం జరిగిందని, దీనివల్ల ప్రమాద బాధిత మృతుల కుటుంబీకులకు ఆర్థికంగా గట్టి భరోసా లభిస్తోందన్నారు. సింగరేణిలో అమలు జరుగుతున్న ఈ ప్రమాద భీమా పథకాన్ని అస్సాం, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాలతో పాటు కోల్ ఇండియాలో కూడా అమలులోకి తీసుకువచ్చారన్నారు. భీమా రంగంలో విప్లవాత్మక పథకానికి మన రాష్ట్ర ప్రభుత్వ చొరవ, సింగరేణి ముందడుగే కారణమన్నారు. ఉద్యోగులు సుఖ సంతోషాలతో ఉండాలని సంస్థ ఎప్పుడూ ఆశిస్తుందని, అయితే అనుకోని ప్రమాదాల వల్ల ఉద్యోగి మృతి చెందితే ఒక్కసారిగా ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో, బ్యాంకు వారితో మాట్లాడి శాలరీ అకౌంటు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రమాద భీమా సౌకర్యాన్ని అమలు జరపడం జరిగిందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా 40 లక్షల రూపాయల వరకు ప్రమాద భీమా పథకాన్ని అమలు జరుపుతున్నామన్నారు. కొత్తగూడెంలో మృతుడి కుటుంబీకులకు డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్ వి సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్, పర్సనల్ కే వెంకటేశ్వర్లు, ఎస్.బి.ఐ. డీజీఎం సత్యనారాయణ కోటి రూపాయల ప్రమాద భీమా చెక్కును హరిదేవి విశ్వకర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) ఎస్.డి.ఎం.సుభానీ, జీఎం(ఐఆర్, పీఎం) కవితా నాయుడు , జీఎం(ఆర్సీ) కుమారి నికోలస్, జీఎం(వెల్ఫేర్) జి.వి.కిరణ్ కుమార్, హెచ్ వో డీ (ఈఈ సెల్) ఎ.జె.ఎం.మురళీధర్, గుర్తింపు, ప్రాతినిధ్య, అధికారుల సంఘం నాయకులు ఎస్వీ రమణ మూర్తి, ఎస్.పీతాంబరరావు, సునీల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## హోమ్ కంపోస్టింగ్ గురించి అవగాహన కల్పించిన అధికారులు





**ఇల్లందు, జూన్ 6, ప్రజాజ్యోతి :** మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో 100 రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం ఇంటింటి చెత్త సేకరణ, తడి చెత్త, పొడి చెత్త వేరు చేయుట, హోమ్ కంపోస్టింగ్ గురించి మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చెత్త సేకరణ కోసం వచ్చే వాహనాలలో తడి చెత్త, పొడి చెత్త వేరువేరుగా ఇవ్వాలని కోరారు. అనంతరం దోమల నివారణకు ఆయిల్ బాల్స్, స్ప్రేయింగ్ చేయడం జరిగింది. అదేవిధంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ వైద్యశాలలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మున్సిపల్, మెప్మా, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి వేదికలుగా రెవెన్యూ సదస్సులు





(మొదటి పేజీ తరువాయి...)

హెల్ప్ డెస్క్ లను,రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. సమస్యల వారీగా అర్జీలను విభజిస్తూ, పక్కాగా రికార్డులను పొందుపర్చాలని అన్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించదగిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. జూన్ 20వ తేదీ వరకు అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని,భూ సమస్యలున్న ప్రజలు ఈ సదస్సులకు హాజరై దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సదస్సులలో ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. ఒకవేళ సమస్యను పరిష్కరించేందుకు నిబంధనలు అంగీకరించని పక్షంలో దరఖాస్తుదారుడికి ఆ విషయాన్ని స్పష్టంగా అర్థమయ్యే రీతిలో తెలియజేయాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తు దారులను పదేపదే తిప్పుకోకూడదని, సదస్సులో అర్జీలు అందించేందుకు వచ్చే వారితో సున్నితంగా వ్యవహరించాలని రెవెన్యూ బృందాలకు హితవు పలికారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, పూర్తి రికార్డుల ఆధారంగానే వాటిని పరిష్కరించాలని సూచించారు. ఈ రెవెన్యూ సదస్సులు ముగిసిన తర్వాత క్షేత్రస్థాయిలో



విచారణ జరపాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని వివరాల నమోదులో తప్పిదాలకు తావు లేకుండా చూడాలన్నారు. అర్హులైన వారికి పూర్తి న్యాయం జరిగేలా సానుకూల దృక్పథంతో పని చేయాలని, అప్పుడే భూభారతి రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సార్థకత చేకూరి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు.

కలెక్టర్ మిట్టగూడం గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డ్ నందు పంచాయతీ సిబ్బంది , గ్రామస్తులకు బయోచార్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఖాళీ డ్రమ్ కింది భాగంలో గాలి ప్రవేశించేలా రంధ్రాలు చెయ్యాలన్నారు. ఈ డ్రమ్ము మూడు సిమెంట్ రింగుల మధ్య ఉంచి అడుగులో ఎండిన ఆకులు వేసి మంట పెట్టాలని అని తెలిపారు . పై భాగంలో ఎండిపోయిన, పనికిరాని మొక్కల భాగాలను వేసి డ్రమ్ము మూతపెట్టారు. రింగుల మధ్యలోను ఆకులు, పొట్టు వేసి మంటపెట్టడంతో ద్వారా తక్కువ ఆక్సిజన్లో కాలిన మొక్కలు బూడిదగా మారకముందే వాటిని చల్లార్చితే ఏర్పడిన బొగ్గును బయోచార్ అంటారని కలెక్టర్ వెల్లడించారు. దీన్ని పొడిలా చేసి పొలాల్లో వాడితే పంటల దిగుబడి పెరుగుతుందని, దీనికి పశుమూత్రం జోడించి ఉపయోగిస్తే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. మట్టిలో జీవపదార్థం పెంపు, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుదల,ఎరువుల అవసరం తగ్గింపు, వాతావరణ మార్పుల ప్రతికూలతను తగ్గించి నేల స్థిరంగా ఉండేలా చేయడం వంటి ఉపయోగాలు ఉంటాయని వివరించారు. ఇలా తయారు అయిన ఎరువులను రైతులకు విక్రయించడం ద్వారా అధికంగా కూడా అభివృద్ధి సాధించవచ్చు అని, ఆ దిశగా పంచాయతీ అధికారులు అడుగులు వేయాలని కలెక్టర్ సూచించారు.

అనంతరం కలెక్టర్ అదే గ్రామంలో కోర్స సోనీ అనే రైతు నిర్వహిస్తున్న కొర్రమేను చేపల పెంపకం యూనిట్ ను సందర్శించారు. ఈ యూనిట్ ను విజయవంతంగా నిర్వహిస్తున్న సోనీ ,ఆమె భర్త దుర్గారావును కలెక్టర్ అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మరిన్ని చేపల పెంపకం యూనిట్లు నెలకొల్పాలని, దానికి గాను రైతులకు శిక్షణ ఇవ్వడానికి సోనీ ఆమె భర్త దుర్గారావు దంపతులు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఉపాధి హామీ పథకం ద్వారా ఫామ్ పౌండ్స్ త్రవ్వడానికి రైతులను ప్రోత్సహించిన సిబ్బందిని అభినందించారు. అనంతరం కలెక్టర్ కరకగూడెం మండలం పర్యటనలో భాగంగా బంగారు గూడెం గ్రామం మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో రహదారి వెంట విప్ప గింజలను ఆరబోయగా కలెక్టర్ ఆగి వాటిని ఆసక్తిగా పరిశీలించారు. అక్కడ ఉన్న గిరిజన మహిళలతో మాట్లాడుతూ విప్ప గింజల నుండి నూనె ఎలా తయారు చేస్తారు? విప్ప పూలు ఎన్ని విధాలుగా ఉపయోగిస్తారు? అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆ గ్రామంలోని చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి వారితో మమేకమై వారి బాగోగులు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అశ్వాపురం తహశీల్దార్, రెవెన్యూ సిబ్బంది ఏపీవో సీతారామయ్య, టి ఏ వెంకటేష్, ఎఫ్ ఏ రమేష్, సర్ప్ ఏ పీ ఎం సత్యనారాయణ, సీసీ సౌభారాణి,, పంచాయతీ అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## వలస గిరిజనేతరుల భూములను పరిశీలించాలి

- గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ



**చర్ల, జూన్06, ప్రజాజ్యోతి :** భూభారతి గ్రామసభలలో రెవిన్యూ అధికారులు ప్రభుత్వ భూములను ఆక్రమించిన గిరిజనేతరుల దరఖాస్తులను పరిశీలించాలని గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ డిమాండ్ చేశారు. చర్ల మండలం ఎర్రబోర్ గ్రామంలో పాయం సన్యాసి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోండ్వానా సంక్షేమ పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు పాయం సత్యనారాయణ దొర మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి గ్రామసభలు జరుగుతున్న సందర్భంగా 5వ షెడ్యూల్ ప్రాంతాలలో ఆదివాసి హక్కుల పరిరక్షణ చట్టాలను రెవెన్యూ అధికారులు పరిశీలించాలని అన్నారు. అలాగే షెడ్యూల్ ఏరియాలలో ప్రభుత్వ భూములు మొత్తం అన్యాక్రాంతం అయ్యాయని గిరిజనేతరుల ఆధీనంలో ఉన్న భూముల దరఖాస్తులను అధికారులు పరిశీలించి ఏజెన్సీ చట్టపరిధిలో ముందుకు పోవాలని కోరారు. గత ప్రభుత్వం షెడ్యూల్ ప్రాంతాలలో సాదాబైనామా పేరుతో పార్లమెంటు చట్టం, 1/70 చట్టం ఉల్లంఘనకు పాల్పడిందని, షెడ్యూల్ ఏరియాలలో 40 సంవత్సరాలుగా గిరిజనేతరులకు కానీ పట్టాలు ఒక బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే అయ్యాయని విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలలో మొత్తం ప్రభుత్వ భూములు వలస గిరిజనేతరుల ఆధీనంలో ఉన్నాయని, ఆ భూముల దరఖాస్తులను రెవిన్యూ అధికారులు చట్ట పరిధిలో పరిశీలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోడి చలపతి, చర్ల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం వరప్రసాద్, మడివి ఉంగ, సోయం చంద్ర, సోడి నాగరాజు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు అంచనా





**ఇల్లందు, జూన్ 6, ప్రజాజ్యోతి :** ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 16వ వార్డులో ఎమ్మెల్యే నిధుల ద్వారా సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ పనులకు శుక్రవారం మున్సిపల్ అధికారులు అంచనా వేయడం జరిగింది. తమ వార్డు అభివృద్ధి కోసం సహకరిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వార్డు ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, 16వ వార్డు కమిటీ సభ్యులు ఉల్లింగ సతీష్, గుడివాడ వీరభద్రం, లింగంపల్లి శ్రీను, జి. రవి తదితరులు పాల్గొన్నారు.

# బడిబాట కరపత్రాన్ని ఆవిష్కరించిన మండల విద్యాశాఖాధికారి ఆనంద్ కుమార్







**అన్నపురెడ్డిపల్లి, జూన్ 6, ప్రజా జ్యోతి :** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఎర్రగుంట పాఠశాలకు సంబంధించిన ప్రత్యేక బడిబాట కరపత్రాన్ని అన్నపురెడ్డిపల్లి మండల విద్యాశాఖాధికారి , జెడ్ పి హెచ్ ఎస్ ఎర్రగుంట ప్రధానోపాధ్యాయులు ఉండేటి ఆనంద కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డిగూడెం గ్రామ కార్యదర్శి నరేష్, గ్రామస్థులు రమణ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు. బడిబాట రోజు వారి కార్యక్రమాలను ప్రధానోపాధ్యాయులు తెలియజేశారు. ప్రభుత్వం పాఠశాలకు మౌలిక వసతులు కల్పించుటలోనూ, ఉచిత పుస్తకాలను, నోటు పుస్తకాలను, రెండు జతల యూనిఫాం, మధ్యాన్న భోజనం ను అందిస్తుందని, అంతేకాక నాణ్యమైన విద్యా బోధనను డిజిటల్ పరికరాల ద్వారా అందిస్తుందని, అందుకే పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పిలుపునిచ్చారు.

- **జూన్ 6 నుండి 19 వరకు బడిబాట రోజు వారి కార్యక్రమాలు...**

6వ తేదీన గ్రామసభ నిర్వహించాలి. 7వ తేదీన ప్రతీ ఇంటిని సందర్శించి బడీడు పిల్లలను గుర్తించాల న్నారు. 8 నుంచి 10 తేదీ వరకు కరప త్రాలతో ఇంటింటి ప్రచారం, అంగన్ వాడీ కేంద్రాల సందర్శన, డ్రాప్ ఔట్ పిల్లలను గుర్తించి బడిలో చేర్పించడంతో పాటు ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించి అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల్లో చేర్పించాలి. 11 వ తేదీన ఈ నెల ఆరవ తేదీ నుంచి పదవ తేదీ వరకు నిర్వహించిన కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించాలి. 12వ తేదీన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ప్రజా ప్రతినిధులతో ప్రారంభించాలని, అదే రోజు విద్యార్థు లకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం లను అందించాలి. 13న సాము హిక అక్షరాభ్యాసం, బాలలసభ 16న ఎఫ్ ఎల్ ఎన్ ,ఎల్ ఐ పి దినోత్సవం నిర్వహించాలి. 17న విలీన విద్య, బాలిక విద్యా దినోత్సవం నిర్వహించలి. 18న తరగతి గదుల డిజిటలీ కరణపై అవగాహన, మొక్కల పెంపకం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించాలి. 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించాలని సూచించారు.

## బొగ్గు నాణ్యత పెంపుదలకు నేటి నుంచే కార్యాచరణ

- జి 13 గ్రేడ్ బొగ్గు సరఫరాకు అన్ని ఏరియాలలో చర్యలు
- సంస్థ డైరెక్టర్ల ఆదేశం



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూన్ 06 , ప్రజాజ్యోతి :** సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గు లో జి 15 గ్రేడ్ బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాల వారు స్వీకరించడానికి ఆసక్తి చూపడం లేదని, కనుక అన్ని ఏరియాలలో జి 13 గ్రేడు బొగ్గును సంసిద్ధం చేసి రవాణా చేయాలని సంస్థ డైరెక్టర్లు ఆదేశించారు. శనివారం నుంచి దీనిని కార్యాచరణలో పెట్టాలని స్పష్టం చేశారు. శుక్రవారం నాడు బొగ్గు నాణ్యత పెంపుదలపై అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు, క్వాలిటీ విభాగం జీఎంలు, ఇతర అధికారులతో సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్. వి.సూర్యనారాయణ, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్, పర్సనల్ కె.వెంకటేశ్వర్లు, ఈడి కోల్ మూమెంట్ ఎస్.డి.ఎం.సుభాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. తక్కువ గ్రేడ్ గల బొగ్గును స్వీకరించడానికి వినియోగదారులు ముందుకు రాకపోవడం వల్ల కంపెనీకి అపార నష్టం జరిగే ప్రమాదం ఉందని, దీనిని నివారించడం కోసం జి 13 గ్రేడ్ వచ్చే విధంగా ఏరియాలలో తక్షణమే తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జి 13 గ్రేడు బొగ్గుకు థర్మల్ విద్యుత్ కేంద్రాల నుండి డిమాండ్ ఉన్నందున దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ బొగ్గు నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని పదేపదే సమావేశాల్లో కోరుతున్నారని, నాణ్యతలేని బొగ్గు వల్ల ప్రయోజనం లేదని వివరిస్తున్నారని, కనుక నాణ్యత ప్రమాణాల పెంపుదలకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. ఆర్జీ–1 ఏరియాలో జీ–8 గ్రేడ్ కొనసాగేలా, అలాగే ఆర్జీ–2 ఏరియాలో జీ–11 గ్రేడ్ కొనసాగించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యత ప్రమాణాల కొరత వల్ల వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై కూడా సమీక్షించారు. ఇంధన సరఫరా ఒప్పందం ప్రకారం కంపెనీ ఇస్తామని ఒప్పుకున్న గ్రేడు బొగ్గును ఇవ్వనట్లయితే నష్టపరిహారం కూడా చెల్లించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా బొగ్గు రవాణాకు సంబంధించిన సమస్యలపై చర్చించి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

## వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ఊరేగింపు





**పాల్వంచ (రూరల్ ), జూన్ 06,ప్రజా జ్యోతి:** పాల్వంచ మండల పరిధిలోని పాండు రంగాపురం తండా గ్రామపంచాయతీలో ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మొదటి రోజు ముత్యాలమ్మ తల్లి అభిషేకం, బొడ్రాయి దగ్గర అభిషేకం, ఆంజనేయ స్వామి విగ్రహ ఊరేగింపు పాండురంగాపురం తండా గ్రామంలో, ఎంతో విశిష్ట కలిగినటువంటి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టను చేపట్టడం ఎంతో సంతోషకరంగా ఉంది అని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అందరూ పాల్గొన్నారు.

## మారుమూల ప్రాంత ప్రజలకు ఉచిత వైద్య సేవలు




**టేకులపల్లి,జూన్05,ప్రజాజ్యోతి:** మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత మెగా వైద్యం శిబిరం వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్ 3 సెక్రెటరీ ఈ.నరేష్ కుమార్,జి.రంజిత్ ఆధ్వర్యంలో అమృత హాస్పిటల్, ఏ జి హెచ్ హాస్పిటల్, అపోలో ల్యాబ్ ల సహకారంతో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ గ్రేడ్ 3 సెక్రెటరీ ఈ నరేష్ కుమార్ మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించే సంకల్పంతో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన అమృత హాస్పిటల్, ఏ జి హెచ్ హాస్పిటల్, అపోలో ల్యాబ్ ల యాజమాన్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో375 మందికి ఆసుపత్రి వైద్యులు ఈ. బాబురావు,జయ,డెంటిస్ట్ కవిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి షుగర్, బీపీ, 2డి ఎకో పరీక్షలు చేపట్టి రోగ నిర్ధారణ చేశారు. మాట్లాడుతూ గిరిజన ఆదివాసి ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో 24 గంటలు సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జి రంజిత్, అపోలో ల్యాబ్ టెక్నీషియన్ ప్రసన్న, చందన, మధు, గోపి ప్రొప్రైటర్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## రాముని సన్నిధిలో హెచ్. డబ్ల్యూ.బి చైర్మన్

**భద్రాచలం కల్చరల్ ,జూన్ 6(ప్రజాజ్యోతి ):** భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని శుక్రవారం సాయంత్రం హెవీ వాటర్ బోర్డ్ (హెచ్.డబ్ల్యు.బి ) చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కే.సత్య కుమార్, హెవీ వాటర్ ప్లాంట్ అశ్వాపురం జనరల్ మేనేజర్ జి.శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గర్భగుడిలో వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీ తయారు అమ్మ వారిని, అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు వీరికి వేద ఆశీర్వచనం అందజేశారు. రామాలయం ప్రత్యేకతను తెలియజేశారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణకవచాలంకరణ



**భద్రాచలం కల్చరల్ , జూన్ 6(ప్రజాజ్యోతి ):** భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5కోట్లతో తయారుచేయించి సమర్పించిన స్వర్వాంగ స్వర్ణ కవచాలను అర్చకులు ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మూర్తులకు బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## ఉపాధి కోర్సులకు శిక్షణ: ఐటీడీఏ పీవో రాహుల్



**భద్రాచలం, జూన్ 6(ప్రజాజ్యోతి ):** ఐటీడీఏ భద్రాచలం ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు సోలార్ ప్యానల్ టెక్నీషియన్, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ ఉపాధి/స్వయం ఉపాధి కోర్సులకు నెల నుంచి రెండు నెలల పాటు ఉచిత శిక్షణ కల్పించడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవతరగతి, ఆపై చదువుకున్న గిరిజన యువతీ, యువకులు శిక్షణ కోసం కులం, ఆధార్ కార్డు, పాస్ ఫోటో, స్టడీ పత్రాలను తీసుకుని 13వ తేదీ ఉదయం 9గంటలకు ఐటీడీఏ భద్రాచలం ప్రాంగణంలో యూత్ ట్రైనింగ్ సెంటర్లో దరఖాస్తు చేసుకోవాలని పీవో సూచించారు. పూర్తి వివరాలకు 8143840906, 6302608905లను సంప్రదించాలని పీవో కోరారు.

## ఐటీడీఏ ట్రైబల్ ఈఈగా హరీష్ బాధ్యతల స్వీకరణ



**భద్రాచలం, జూన్ 6(ప్రజాజ్యోతి ):** భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ ఆదేశాల మేరకు ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగంలో ట్రైబల్ ఈఈగా హరీష్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఈ మేరకు అదనపు బాధ్యతతో విధుల్లో చేరారు.భూపాలపల్లి ఏటూరు నాగారం ఐటీడీఏలో ఏఈఈగా పనిచేసి 2018లో పాల్వంచ డివిజన్లో పనిచేసి, డీఈఈగా పదోన్నతిపై అక్టోబర్ 2019లో అశ్వారావుపేటలో పనిచేసి ఫిబ్రవరి 2021 ఐటీడీఏ డీఈగా విధులు నిర్వహిస్తూ తాజాగా ఐటీడీఏ ట్రైబల్ ఈఈగా బాధ్యతలు చేపట్టారు.

## బ్రెయిన్ స్ట్రోక్ బాధితురాలికి ఆర్థిక సాయం



**ఇల్లందు, జూన్ 6, ప్రజాజ్యోతి:** మండలంలోని 21 పిట్ కు చెందిన బియ్యని రమేష్ భార్య లావణ్యకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో శుక్రవారం 21 ఫీట్ సిపిఐ నాయకులు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం వారి కుటుంబసభ్యులకు అందజేశారు. బాధితురాలు వైద్య చికిత్సకు సహకరించిన ప్రతి ఒక్కరికి 21 ఫీట్ శాఖ సిపిఐ పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బొప్పిశెట్టి సత్య నారాయణ, గుగులోత్ కృష్ణ, మంచాల వెంకటేశ్వర్లు, శ్రీను, భాస్కర్, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# సర్కార్ బడి పిలుస్తోంది

**విద్యార్థుల సంఖ్య పెంపునకు చర్యలు**

- **ప్రారంభమైన 'బడిబాట'**
- **ప్రైవేటుకు ధీటుగా ప్రచారం**

**భద్రాచలం , జూన్ 6, ప్రజాజ్యోతి :** సర్కారు బడి పిలుస్తోంది రారమ్మని..అన్ని వసతులు ఉంటాయని, అర్హత, అనుభవం ఉన్న ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తారని చెప్తోంది...ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం 'బడి బాట'కు సిద్ధం అయింది . జూన్ 6శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభం చేసింది.ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇప్పటికే ఈ పనిలో నిమగ్నం అయ్యారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకొని ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు . గత విద్యా సంవత్సరంలో విద్యార్థు లు సాధించిన విజయాలను కరపత్రాల రూపంలో ముద్రించి పంచుతున్నారు. విద్యాశాఖ ఆదేశాలతో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మాట్లాడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉండే వసతులు, మెరుగైన విద్యా బోధనపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రచారం చేస్తున్నారు.

**భవిష్యత్తుకు బంగారు బాటలు**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉంటాయి. నిష్ణాతులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారని . విద్యా సంవత్సరం ఆరంభంలోనే ఉచితంగా పాఠ్య పుస్తకాలు, రెండు జతల యూనిఫాంలు పంపిణీ చేస్తారు. పౌష్టికాహారం, గుడ్లు, రాగి జావా ఇస్తారు. కంప్యూటర్ తరగతులు, శారీరక దృఢత్వం కోసం వివిధ క్రీడల్లో శిక్ష ణ, విశాలమైన తరగతి గదులు ఉంటాయి. ఒత్తిడి లేని విద్య, ఆంగ్లంపై ప్రత్యేక శ్రద్ధ, నిరంతర సమగ్ర మూల్యాంకనం, పఠన సామర్థ్యాల పెంపునకు గ్రంథాలయాలు, కంప్యూటర్ విద్యా, సైన్స్, గణిత, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహిస్తారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తి పెంపనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ అంశాల పై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.గ్రామ పంచాయతీలు, జన సమీకరణ ఉన్న ప్రాంతాల్లో స్వయం సేవకబృందాల సభ్యులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, అంగన్వాడీల సహకారంతో విస్తృత ప్ర చారం చేస్తున్నారు.

### బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి :

- **రాజా శ్రీనివాస్ , ప్రధానోపాధ్యాయులు**



బడిబాట లో భాగంగా సర్కార్ బడిలో అందించే నాణ్యమైన విద్య తో పాటు బడిలో కంప్యూటర్ తరగతులు, శారీరక దృఢత్వం కోసం వివిధ క్రీడల్లో శిక్ష ణ, విశాలమైన తరగతి గదులు. ఒత్తిడి లేని విద్య, ఆంగ్లంపై ప్రత్యేక శ్రద్ధ, నిరంతర సమగ్ర మూల్యాంకనం, పఠన సామర్థ్యాల పెంపునకు గ్రంథాలయాలు, కంప్యూటర్ విద్యా, సైన్స్, గణిత, ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరిస్తూ భరోసా కల్పిస్తు న్నాం. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతున్నాము . 'బడిబాట'లో భాగంగా తల్లితండ్రులకు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేస్తున్నాము .






## పొడి దుక్కిలో విత్తనాలు నాటొద్దు

- **పురుగులు ఆశించే ప్రమాదం అధికం - ఏడిఏ శోభన్ బాబు**





**టేకులపల్లి,జూన్05,ప్రజాజ్యోతి :** రైతులు తొందరపడి విత్తనాలు నాటొద్దని ఏడిఏ శోభన్ బాబు రైతులకు సూచించారు. వర్షాకాలం సాగుకు సన్నద్ధమౌతున్న రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని ఏ డి ఏ రైతులకు చెబుతున్నారు. సుమారు 60 మి.మీ నుంచి 70మి.మీ వర్షం పడినప్పుడు మాత్రమే భూమి చల్లబడుతుంది.అప్పటి వరకు రైతులు పొడి దుక్కిలో విత్తనాలు నాటరాదు. సమీప గ్రామాల్లో కురిసిందనే అపోహతో రైతులు ఒకరిని చూసి మరొకరు విత్తనాలు నాటడం సరికాదని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. విత్తనాలు నాటిన తర్వాత 4నుంచి 5రోజుల్లో వర్షం పడకపోతే భూమిలో ఉన్న విత్తనాలను మట్టిపురుగులు, పెంకు పురుగులు తింటాయి. దాంతో విత్తనాలు మొలకెత్తవు. రైతులు దుక్కుల్లో జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల విత్తనాలు మొలకెత్తడంలో సమస్యలు తలెత్తుతాయి. సుమారు 30సెంటీమీటర్ల లోతు వరకు నేలను దుక్కి చేసుకోవాలి కానీ విత్తనాన్ని మాత్రం సుమారు 5నుంచి 10సెంటీ మీటర్ల లోతు వరకు మాత్రమే విత్తుకోవాలి. దుక్కిలో సరిపడా తేమశాతం ఉంటేనే విత్తనాలు నాటుకోవడం ఉత్తమం.పత్తి రైతులు అధిక సాంద్రత విధానంలో పంట సాగు చేస్తే అధిక దిగుబడి లభిస్తుంది. విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. కాగా విత్తనం నాటుకునేందుకు సరిపడా వర్షం కురిసేంతవరకు రైతులు విత్తనాలు నాటకూడదని ఎడిఎ శోభన్ బాబు తెలిపారు. భూమిలో ఉన్న ఉష్ణోగ్రత తగ్గి తేమ శాతం పెరగాలని,లేదంటే నాటిన విత్తనాలను పురుగులు ఆశించే అవకాశం ఉంటుందన్నారు. 9వ మైల్ తండాలో షాప్ లో ఏ డి ఏ శోభన్ బాబు రిజిస్టర్, ఇన్వాయిస్, పర్మిషన్ కాపీ చెక్ చేశారు. పిఏసిఎస్ సొసైటీ, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ విధానాన్ని పర్యవేక్షణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో అన్నపూర్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.